

# గాఢాంధకారంలో ఒక కాంతికిరణం

తేరాలక్ష్మి

'తాతయ్యా! తాతయ్యా!'

గులాబిమొక్క పాదును సరిచేస్తున్న వెంకట్రామయ్య తనను పిలుస్తూ పరిగెత్తుకొచ్చిన మనుమరాలు సరోజకేసి చూస్తూ, నవ్వుగా నవ్వి, 'ఏమిటమ్మా?' అనడిగాడు.

'మరేమో తాతయ్యా, నాన్నను డబ్బులడిగితే కోప్పడుతున్నాడు.'

'ఎందుకమ్మా డబ్బులు?' ముద్దులొలుకుతున్న సరోజ బుంగమూతికేసి చూస్తూ తనూ బుంగమూతి పెట్టి అడిగాడు.

'ఎందుకేమిటి? స్కూలు దగ్గర ఐస్ ప్రూట్లూ, వేరుశనక్కాయలూ కొనుక్కోవద్దా?'

'వోహో అందుకా! జానమ్మా కొనుక్కోవాలి.'

'మరి డబ్బు లివ్వవూ?' బ్రతిమాలుతూ అడుగుతున్న సరోజను చూసి నవ్వాడాయన.

'ఇదిగో నేను పని చేస్తున్నాను గదా, వీలా యిచ్చేదీ? నువ్వెళ్లి బామ్మ నడుగు. నా పేరు చెప్పితే యిస్తుందిలే.'

'మా మంచి తాతయ్యా!'

యూనిఫారంలో ముద్దొస్తున్న సరోజను చూస్తూ, 'ఆ 'బెల్టు' అంత బిగుతుగా వుంటే బాగుండదు. కాస్త వదులు చేసుకోమ్మా' అన్నాడు.

వదులు చేసుకున్నది సరోజ.

'ఏదీ ఒక్క ముద్దు పెట్టుకోవూ!' అన్నాడు లోతుకుపోయిన బుగ్గల్ని గాలితో ఉబ్బిస్తూ.

ముద్దు పెట్టుకున్న సరోజ 'ఛీ! గుచ్చుకుపోతున్నాయ్' అన్నది.

ఆమె మొహంలోని ఏవగింపును చూసి నవ్వాడు వెంకట్రామయ్య.

'వస్తాను తాతయ్యా, టాటా!' అంటూ పారిపోయింది సరోజ. వెళ్తున్న ఆమెకేసి వోసారి చూసి తన పనిలో నిమగ్నుడయ్యాడు.

'బాబుగారూ!'

ఉలిక్కిపడి తలెత్తి చూసాడు. శుష్కించిన శరీరానికి, పాతదై చిరిగిపోయిన కమీజులాంటి వొకదాన్ని తొడుక్కొని, మాసిపోయిన గుడ్డ నొకదాన్ని గోచీగా పెట్టుకొని, తన దీనావస్థనంతా మొహంలో నింపుకొని, చేతులు జోడించి తనకేసి చూస్తున్న ఒక అపరిచిత వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్రామయ్య.

'ఏమిటి బాబూ!' అనడిగాడు.

'పదిమంది మీపేరు జెప్పుకుంటూంటే యినొచ్చాను. నాకు తవరే దిక్కు. నాకే ఆధారమూ లేదు. పెట్టుకింద నా ఆడిది, కొడుకు ఆకల్తోని మలమల మాడుతున్నారు. తమరుగాదంటే సావే గతి!' ఏడుస్తూ ఆయనకాళ్లమీద పడబోయాడు.

'వద్దు నాయనా, లే' అని లేపాడు. 'ఇంట్లో నామాటగా జెప్పి ఇన్ని బియ్యం అడుక్కుపో' అన్నాడు.

అతడలాగే నిల్చున్నాడు. 'ఏమిటన్నట్టు' చూసాడు.

'ఒద్దుబాబూ! నే నడుక్కు తినలేను. ఆ బియ్యమైపోతే మళ్లెవరి దగ్గిరికి బోయేది?' అన్నాడు చేతులు నులుముకుంటూ.

'మరేమిటంటావ్?'

'ఏదో తవ కాళ్లదగ్గర పడుండనీండి సాలు. ఏ పనిజెప్తే ఆపని జేత్తా. మా నోళ్లల్ల యింత గంజిబోయండి.'

ఏమనాలో బోధపడలేదాయనకు, అతడి దీనావస్థను చూస్తూంటే మనస్సు కరిగిపోతున్నది. తనేదో డబ్బు యిచ్చినంత మాత్రాన ఆరోజు గడవొచ్చుగానీ, అతని జీవన శకటం ఒక దార్లోకి వచ్చేందుకు దోహదమవదు. అతనికో దారంటూ చూపే విధానమేదో కాసేపటివరకూ బోధపడలేదు.

'పోనీ ఈతోటపని చూసుకుంటావా?' అనడిగాడు.

వికసించిన మొహంతో 'మీరేం పని జెప్పినా జేత్త' అన్నాడతను.

'సరే, ఈ రోజునుంచే వచ్చెయ్. ఈ కాంపౌండులోనే వో పాక వేసుకో. మొక్కలన్నిటినీ జాగ్రత్తగా చూస్తూండు.'

'దరమ పెబువులు తవమేలు మరిసిపోలేను' అంటూ కాళ్లపై బడబోయాడు.

'వద్దునాయనా! నువ్వనుకునేంత ఘనకార్యమేమీ చేయలేదు నేను' అన్నాడతన్ని ఆపుతూ.

అతడు వెళ్తున్న దిక్కే చూస్తున్న ఆయన మనస్సులో గత స్మృతులు మెదలుతూంటే హృదయం బరువెక్కింది.

* * *

దీనంగా మొహం వేళ్లాడేసుకొని, ఒట్టి చేతులతో వచ్చిన వెంకట్రామయ్యని చూసి 'ఏమైందండీ? ఏమన్నారు?' అని ఆత్రంగా అడిగింది తులసమ్మ.

తలమీది కండువాను దండెంమీదేసి కూర్చుంటూ, నోట్లో వేలేసుకొని చీకుతున్న కొడుకొని చూసి నిట్టూరుస్తూ 'కొత్తగా ఏమంటారు? పాతమాటే అన్నారు' అన్నాడు.

'ఇవ్వనన్నారా?'

'నేను సరిగా మగ్గం ఆడించనని, నా చేతిలో చీరెలు చెడిపోతాయనీ అన్నారు.'

'అయ్యో, వీట్లాగండీ? మనగతేం గావాలె? మనం కడుపులు మాడ్చుకున్నా వాడిగతేంటి? వాడింతసేపూ గుక్కపట్టి ఏడిస్తే, ఇంత గంజిబోస్తే పడున్నడు.'

'ఏం చేయాలి చెప్పవే? పెట్టుబడి పెట్టే షావుకార్లందరి దగ్గరికి వెళ్లాను. నూలు యివ్వమనీ, కొంత డబ్బివ్వమనీ బ్రతిమాలాను. నూలు యిచ్చేందుకే వెనుకాడారు కొంతమంది. నూలిచ్చినా, చీరె నేసింతర్వాత చూసి బాగుంటేనే కూలి యిస్తామన్నారు కొందరు. ఒంట్లో ఆసరా లేందే ఎలా నేసేదే?'

ఆకలైందేమో గుక్కపట్టి ఏడువసాగాడు వెంకట్రామయ్య ఏకైకపుత్రుడు చంద్రం. వాన్ని సముదాయించే ప్రయత్నం చేసి, చివరికి వేసారి, వెన్నుపై ఒక్కటి తగలేసి, వాడితోబాటు తనూ శోకాలు ప్రారంభించింది తులసమ్మ.

వారిని చూస్తూంటే గుండె తరుక్కుపోసాగింది వెంకట్రామయ్యకు. వెన్నుకు అంటుకుపోయిన తులసమ్మ కడుపునూ, సరియైన తిండిలేక కాళ్లూ, చేతులూ నీరెక్కి, వాచి, కడుపుబ్బిన చంద్రంను చూస్తూంటే కళ్లల్లో నీళ్లు తిరిగినై. ఆకలితో ప్రేవులు గలగలమంటూ తన కడుపులో గూడా శబ్దం చేసినై.

'అబ్బ, ఊరుకోవే. వాడితో నువ్వు గూడా ఏడిస్తే వీట్లా?'

ఆయనకేసోమారు చూసి తన ఏడుపు స్థాయిని కొంత తగ్గించింది తులసమ్మ.

'ఊరుకోవే. చెప్తూంటే వినిపిస్తూ లేదూ? ఎవరో చచ్చిపోయినట్లు నడింట్లో ఏమిటీ రొద!'

'అదొక్కటే తక్కువైంది. రేపిపాటికి పీడు బస్తీ విడిచే వోపికగూడా వుండదు' అని ఏడుపుపొంగుని తగ్గించకుండానే అన్నది తులసమ్మ.

వారివా స్థితిలో చూస్తుంటే మనస్సు చికాకుగా తయారైంది. అక్కడుండాలనిపించలేదు. చరాచరా బయటికొచ్చాడు. మనస్సంతా పిచ్చిపిచ్చిగా తయారైంది. ఏం చేయాలో తోచక కాలుగాలిన పిల్లిలా తిరిగాడు. 'ఇప్పుడేదో ఆధారం లభించాలి. మండుతున్న కడుపులోకి ఇంత చేరవేయందే శరీరమూ, మనస్సూ అదుపులో వుండేట్టు లేవు. ఏం చేయాలి? ఎలా సంపాదించాలి? ఇంకెవరి నడగాలి డబ్బు? ఆఁ, ఒక్కటే ఆధారం! ఆయన్నే అడగాలి. నిన్న వెళ్తే వూరికెళ్ళాడన్నారు, బహుశా ఈ రోజు రావచ్చు. ఆయనతో గూడా లేదనిపించుకుంటే అడుక్కు తినడమో, లేదా అందరూ కట్టుగట్టుకొని చెరువులో దూకడమో, ఏదో ఒకటి జరుగుతుంది.'

ఒంట్లో శక్తిలేక కాళ్ళు తడబడుతూంటే సుందర్రామయ్య ఇంటికేసి నడిచాడు.

కాలుమీద కాలేసుకొని వరండాలోని కుర్చీలో కూర్చున్నాడాయన. చేతులు కట్టుకుని ముందు నిలిచాడు. 'మీరొక్కరే గతి. మా చావు బ్రతుకులు మీ చేతుల్లో వున్నాయి' అన్నాడు కన్నీళ్ళ మధ్య.

'ఏమిటి వెంకట్రామయ్యా?' నిదానంగా అడిగాడతను.

'పెట్టుబడి యిప్పించండి. మీ పేరు చెప్పుకుని బ్రతుకుతాం.'

'నీకు సరిగ్గా నేయరాదంటారు గదయ్యా!'

'ఒక్కసారేదో పొరపాటైనంత మాత్రాన మళ్ళీ అట్లా గానిస్తానా? తమరు ఈ సారి యిచ్చి చూడండి, నాపని పసందనిపించకపోతే నా కూలిపైసలు పూర్తిగా యివ్వకండి.'

అనుమానంగానే చూసాడాయన. 'ఏమో! చీర చెడిపోతే పదిహేను రూపాయలు ఏట్లో గలిసినట్టవుతుంది. చెడిపోయిందన్నీ ఏ అమాయకుడు కొంటాడయ్యా?'

ఉన్న ఒక్క ఆశా అడియాసైనందుకు కృంగిపోయాడు వెంకట్రామయ్య. ఇంట్లో భార్యా, కొడుకూ జ్ఞాపకం రాగానే మనస్సు నీరైపోయింది. 'తమ బ్రతుకులు బాగుపడే యోగం లేదు, ఇక చావేగతి!' అనిపించగానే కళ్ళు మసకలు గమ్మాయి. మొహం వేల్లాడేసుకొని వెనక్కు మళ్ళాడు.

'పోనీ ఒకపని జేస్తావా?' అన్నాడాయన.

'ఏమిటి చెప్పండి' అన్నాడు ఆశతో మొహం విప్పారగా.

'మేం నేయించిన చీరల్ని మూటగట్టుకొని నాలుగూళ్ళూ తిరిగి అమ్ముకొస్తావా? నీ కూలి నీకు ముట్టజెబుతాను.'

ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోయిన వెంకట్రామయ్య నోటంట మాట రాలేదు. కృతజ్ఞత నిండుకున్న కళ్ళలో ఆయనవేపు చూసి మూగసైగలు చేసాడు.

'సరే. ముందుగానే నీకొంత యిస్తాను. రేపటినుంచీ అమ్మేందుకు వెళ్తావా?'

తలూపాడు. ఆయనిచ్చిన డబ్బు అందుకుంటున్నప్పుడు సంతోషం హృదయకుహరాన్ని నింపి, కళ్ళగుండా బయటికి ప్రవహించింది.

* * *

'నాన్నా, నే నాఫీసుకు వెళ్తున్నాను.' అన్న చంద్రం మాట వినిపించగానే ఇహంలోకొచ్చాడు వెంకట్రామయ్య.

ఆయన కన్నీటి ధారల్నిచూసి గాభరా పడిపోయి 'ఏడుస్తున్నావేం నాన్నా?' అన్నాడు కంగారుగా.

'నే నేడుస్తున్నానా?' ఆశ్చర్యంగా చెంపల్ని తడుముకున్న వెంకట్రామయ్య, చేతులకు కన్నీరు తగలగానే, 'అది ఏడుపు గాదు బాబూ! బ్రతుకుతెరువు లభించిన సంతోషంలో ప్రవహిస్తున్న ఆనంద భాష్పాలు' అన్నాడు.

ఆయనమాటలు అర్థంగాలేదు. వాచీ చేసి చూసుకొని, 'టైమైపోయింది నాన్నా! నే వెళ్తున్నాను' అని టైసవరించుకుని, స్కూటరెక్కి వెళ్ళిపోయాడు చంద్రం.

'ఏమండీ! మీ రెప్పుడొచ్చారు? శంకరయ్యపోయి షాపుతెరిచి గంటన్నరవుతున్నది. మీకింకా తీరుబాటుగాలేదా?' నేలచూపులు చూస్తూ యింట్లోకొస్తున్న వెంకట్రామయ్యను చూస్తూ అన్నది తులసమ్మ.

'వెళ్తున్నానే.'

'ఈ రోజు వెళ్ళట్టుగానే వుంది! త్వరగా స్నానంచేసి భోంచేయండి. కొట్టు గుమాస్తాల కప్పజెప్పి మీరింట్లో వుండటం ఏమీ బాగా లేదు.'

'వాళ్ళు చాలా మంచివాళ్ళే. వారి నిజాయితీపై నమ్మకంలేందే వారి కప్పజెప్పుతానా?'

'ఏం నిజాయితీయో, ఏమో? ఈ కాలంలో ఎవర్నీ నమ్మేందుకు వీల్లేదు. ఏమీ లేనివాళ్ళని దగ్గరికి తీసారు. అంతో ఇంతో వెనకేసుకునేందుకు ఏదన్నా చేస్తే దిక్కేది?'

ఆమె మాటలకు హృదయంలో కలుక్కుమంది. బీదవాళ్ళపై ఆమెకున్న తక్కువ అభిప్రాయానికి మనస్సు విలవిల్లాడింది. పై అంతస్థులోవుండి మాట్లాడుతున్న తులసమ్మ, తాను ఒక్కొక్క మెట్టు ఎక్కి పైకి వచ్చిందన్న జ్ఞానాన్ని కలిగి ఉండకపోవడం బాధ కలిగించింది. ఆమెతో ఏమీ మాట్లాడా లనిపించలేదు. స్నాన, భోజనాదులు వకానంగా ముగించి బట్టల షాపుకు చేరుకున్నారు. శంకరయ్య, మహదేవులు కష్టమర్సుకు బట్టలు చూపిస్తున్నారు. తానెళ్ళగానే నమస్కరించినవారికేసి ఆదరంగా చూసి, వెళ్ళి తన స్థానంలో కూర్చున్నాడు. ఒకొక్కరికి రసీదు వ్రాసిస్తూ, డబ్బు తీసుకొని చిల్లర యిస్తున్నాడు. నోట్లు పెట్టె నిండా నిండిపోయాయి. పది, ఐదు, ఒక రూపాయల నోట్లను వేనికవి వేర్వేరు కట్టలు కట్టి, దారంతో బిగించి, సొరుగుల్లో దాచాడు.

ఇంతలో సూటు బూటు వేసుకున్న ఒకాయన, టెర్లిన్ బట్టల్లో మెరిసిపోతున్న మరొకావిడ వచ్చారు. వార్ని చూడగానే లేచి ఎదురెళ్ళి, 'రండి, రండి' అని ఆహ్వానించాడు చిర్నవ్వు ముఖంతో.

'నా వైఫ్‌కి టెర్లిన్, టెరికాటన్ చీరెలు చూపించండి' అన్నాడతను నల్ల

కళ్లజోడు తీస్తూ.

'చూపిస్తాను, మీరలా కూర్చోండి. మహదేవ్ ఆ ఫ్యాన్ వేయవయ్యా!' అని అతనితో అని, 'ఏం తెప్పించమంటారు? కాఫీయా, బోర్నవిటా? కూల్‌డ్రింకా?'

ఆ వచ్చినతను సంతుష్టుడై, 'నో, నో, అక్కర్లేదు. క్లాత్స్ చూపించండి. దట్సాల్!' అన్నాడు చిర్నవ్వుతో.

నాలుగైదు రకాలవి తీసి ఒక్కొక్కదాని ఖరీదే చెప్పాడు. ఆవిడ విలాసంగా అన్నిటినీ తిరగేసి చూస్తూ, తన ఒంటికి ఆనించుకొని చూస్తూ పెదవి విరిచింది. ఆమె మొహంలోని భావాలను చదివిన వెంకట్రామయ్య సన్నగా నవ్వి, 'శంకరయ్యా, ఆ పైనున్నవి ఇలా తీసుకరా!' అని కేకేసాడు.

అతనవి తీసుకరాగానే ఒక్కొక్కటీ పర్చించి చెబుతూ, 'ఇవి ఖరీదైనవి. ఇంతకన్నా మంచి డిజైన్లు మరి దొరకవు' అన్నాడు.

చూసిందే పలుమార్లు చూసి, ఆఖరుకు రెండుచీరెలు సెలెక్టు చేసుకుందావిడ.

'శంకరయ్యా! వీటిని ప్యాక్‌చేయి' అని చెప్పి, తానే రశీదు వ్రాసిచ్చి డబ్బివ్వగా పుచ్చుకొని, 'మళ్లీ వోమారు దయచేయండి. బొంబాయి నుంచి ఈ వారం రోజుల్లో కొత్త డిజైన్లు వస్తాయి' అన్నాడు చిర్నవ్వుతో.

వారెళ్లిపోగనే, 'ఒక్కోదానికి పది రూపాయలు మన మామూలు లాభంకన్నా ఎక్కువ చెప్పారు!' అన్నాడు మహదేవు నవ్వుతూ.

'వారికది యిబ్బందిగా అనిపించదు మహదేవూ! డబ్బెక్కువైనదే నాణ్యమైనదనుకుంటారు.' అన్నాడు గంభీరంగా నవ్వుతూ.

కస్టమర్సు వస్తూనే వున్నారు, వెళ్తూనే వున్నారు.

'ఈ ప్రింట్లుకన్నా యాభైపైసలు తక్కువ చేయండి తీసుకోనంటున్నారండి!' అన్నాడు శంకరయ్య బట్టను చూపిస్తూ.

'ఫరవాలేదు యిచ్చేయి'

'దానివల్ల మనకు లాభం ఉండదు'

'పోనీ లేవయ్యా! పాపం అతని దగ్గర డబ్బు గుంజడ మెందుకూ! ఈరోజు లాభమంతా టెర్లిన్ చీరల్లోనే వచ్చింది' అన్నాడు నవ్వుతూ.

వెళ్లిపోయాడు శంకరయ్య.

మధ్యాహ్నమైంది జనం రావడం తక్కువైంది. అడపాదడపా ఎవరో ఒకరు వస్తున్నారు. చేతినిండా పనిలేనందుకు ఆలోచనలు కమ్ముకు వస్తున్నాయి.

'మర్చేపోయాను నిన్నటితారీకు చింపనేలేదు' అంటూ మహదేవు లేచి, లక్ష్మీదేవి క్యాలెండర్‌లోని ఒకపేజీని చింపి వేశాడు.

పరధ్యానంగా అటుచూసిన వెంకట్రామయ్య ఆతారీకు కనిపించగానే ఉలిక్కిపడ్డాడు. 'అవును! ఇదే తారీకు! తన జీవనగతిని మార్చివేసిన పవిత్రదినమిదే!' మనస్సు గతంలోకి వెళ్లింది.

ఆనాడు, మూటలోని చీరలన్నీ అమ్ముకుని, డబ్బంతా సుందర్రామయ్య కప్పజెప్పి, తన కూలిడబ్బులు తీసుకోనొచ్చిన వెంకట్రామయ్యను జూసి నిండుగా నవ్వింది తులసమ్మ.

'ఎందుకో అంత సంబరపడి పోతున్నావేమే? పిల్లవాడేడీ?' అనడిగాడు వెంకట్రామయ్య, భార్య నవ్వులోని అంతరార్థమేమిట్రా బోధపడక.

'చంద్రం బడినుంచింకా రాలేదు. మీరు నామాటవింటే మూర్ఛబోతారు!' అన్నది ఆ చిర్నవ్వింకా మాయకుండా.

'అంత గొప్పసంగతేమిటీ?' కుతూహలాన్ని నుచుకోలేక పోయాడు.

'గొప్ప సంగతే. ఇన్నేండ్లు డబ్బాలో వేసిన రూపాయల్ని మంచి దినమని ఈనాడే లెక్కబెట్టాను. ఎన్ని అయినాయో తెలుసాండీ!' కనుబొమ లెగరేస్తూ, కళ్లు పెద్దవిచేస్తూ అన్నది.

ఆమె ఊరింపు మాటలకు ఆగలేకపోయాడు. ఆ గెంతైందో తెలుసుకోవాలన్న కుతూహలానికి, ఆమె ఆలస్యం కోపం తెప్పించింది. 'చెప్పవే' అన్నాడు కోప్పడుతూ.

'అయిదువందలు!' గుండెపై చేయి వేసుకొని అంది.

'అయిదువందలే! నిజమా? నిజంగానే అంటున్నావే?' విస్మయానందాలతో ఆమెను కుదుపుతూ అన్నాడు.

'అవును, అయిదువందలు.'

'ఆఁ!'

వెంకట్రామయ్య నమ్మలేకపోతున్నాడు. 'తాను అయిదువందలు కూడబెట్టాడంటే అది మామూలు విషయంగాదు. తనేమిటి, ఐదువందలు జమచేయడమేమిటి?' అని లెక్కబెట్టేంతవరకూ మనస్సు కుదుటబడలేదు. గబగబావెళ్లి డబ్బాను బోర్లించి, లెక్కబెట్టాడు.

'అవును, ఐదువందలు. అచ్చట్లుగానే అయిదువందలు! అబ్బో, అయిదువందలు!!' గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. మనస్సు సంతోషంతో తేలికై ఆకాశంలో రెక్కలు విచ్చుకొని విహరించసాగింది. ఏమేమో చేయాలన్న ఊహలు గజిబిజిగా అల్లుకుపోయి మనస్సును వూపివేస్తున్నాయి. 'ఆ సుందర్రామయ్య చలవ వల్ల తానో స్థితికి రాగలిగాడు. తన కాళ్లపై తను నిల్చుండే శక్తిని సంపాదించుకోగలిగాడు. అబ్బ, ఎంతహాయిగా వుంది మనసు కిప్పుడు! మొదట ఆయన దగ్గరికెళ్లి, ఆయన కాళ్లపై బడాలి, ఆయన అనుమతి పొందాలి. ఆయన ఆశీర్వాదంతో తన సొంత వ్యాపారం ప్రారంభించాలి.'

ఇక అక్కడ నిలువలేక సుందర్రామయ్య దగ్గరికి పరిగెత్తాడు. మాట తడబడుతూంటే ఆయనకు తన అభిప్రాయాన్ని చెప్పాడు.

'సరే నీయిష్టం వెంకట్రామయ్యా... నువ్వో రేవుకు రాగలిగితే నాకూ సంతోషమే' అన్నాడు ఏ కల్మషమూ మనస్సులో పెట్టుకోక.

ఆయన కాళ్లపై పడ్డాడు వెంకట్రామయ్య కృతజ్ఞతా భావంతో.

మరునాడు కొన్ని చీరెలు ఖరీదు చేసుకొని, మూట చంకనేసుకుని బయలుదేరి 'సొంత వ్యాపారం చేస్తున్నానన్న' సంతోషంతో యింకా ఎక్కువ ఊళ్లు తిరిగాడు. అదృష్టదేవత కరుణ దృక్కులు ప్రసరించింది. దశ తిరిగింది. తొందరగా అమ్ముడయాయి. ఎక్కువ లాభాలు వచ్చాయి. ఇంకా ఎక్కువ చీరెలు ఖరీదు చేసాడు. ఇంకా ఎక్కువ లాభాలతో అమ్మాడు. కొత్తకొత్త రకాలని యింకా కొన్నాడు...

ఇంకా ఎక్కువ లాభాలు ...

సంవత్సరం కల్లా ఎన్నడూ వూహించనంత సంపాదించ గలిగాడు. తుఫానుల నెదుర్కొన్న జీవితనావ నిశ్చల, నిశ్శబ్ద, గంభీర వాతావరణంలోకి వచ్చింది.

'ఈ డబ్బు తీసుకోండి.'

ఉలిక్కిపడి చూశాడు వెంకట్రామయ్య. నోట్లు లెక్క పెడుతూ ఇస్తున్నా డొకాయన. శంకరయ్యనడిగి, రశీదు వ్రాసిచ్చి డబ్బు తీసుకున్నాడు. బిల్లరయిచ్చి పంపాడు.

రాత్రయింది. డబ్బు లెక్క పెట్టుకొని, కట్టలుగా కట్టి, సొరుగులో పెట్టి తాళంవేసి, గుమాస్తాను వెళ్ళమనిచెప్పి, దుకాణం మూసి యింటికి వచ్చాడు వెంకట్రామయ్య.

చంద్రం సూటు వేసుకొని తయారై ఎటో వెళ్తున్నవాడు ఆయన్ని చూసి ఆగాడు.

'ఈరాత్రి ఎక్కడి కెళ్తున్నావ్ చంద్రం?' అనడిగాడు.

'సిటీ కెళ్ళాలి నాన్నా నా ఫ్రెండు సబిన్స్పెక్టర్ భాస్కర్ లేడూ, వాడి చిన్నాన్నయింట్లో డిన్నరుందట, రమ్మన్నాడు. ఈ రాత్రే వస్తాం. కాస్త ఆలస్యం కావచ్చు' అన్నాడు.

'వెళ్తే వెళ్ళావుగానీ, ఈ రాత్రికే గాకుండా రేపు రా చంద్రం. ఈ మధ్య ఈ ప్రాంతంలో దొంగలు తిరుగుతున్న సంగతి నీకు తెలుసు'

'ఫరవాలేదు నాన్నా పిస్టల్ తీసుకెళ్తున్నాను' అన్నాడు నిర్లక్ష్యంగా నవ్వుతూ.

అతడి ధోరణికి నిట్టూర్చాడు వెంకట్రామయ్య. 'నీ యిష్టం బాబూ!' అన్నాడు.

టకటక బూట్ల చప్పుడు చేస్తూ వెళ్ళిపోయాడు చంద్రం.

భోజనాలయేసరికి రాత్రి పదైంది. తనగదికి చేరుకొని మంచంపై కొరిగాడు వెంకట్రామయ్య. అలసటతో వెంటనే కన్ను మూతబడింది.

లైటేసిన చప్పుడు కాగానే కళ్ళు తెరిచాడు. ఎదురుగా ముగ్గురు భయంకర వ్యక్తులు, విగ్రని దుస్తులేసుకొని, కళ్ళకు గంతలు కట్టుకొని తుపాకులతో నిల్చుండటం చూసి అదిరిపడి దిగ్గున లేచి కూర్చున్నాడు.

'కదలకు. ప్రాణాలు తీస్తాను' అన్నా డొకతను తుపాకి గురిపెడుతూ.

అయోమయంలో పడ్డాడాయన. వారెవరో మొదట అర్థం కాలేదు. కానీ పేపర్లలో తరచుగా చదువుతున్న వార్తలు గుర్తుకు రాగానే కుదుటపడ్డాడు. మనస్సుకు ధైర్యం తెచ్చుకున్నాడు. వారి ఉద్దేశాలేవో, వారి ప్రవర్తనల్లో, వారి చర్చల్లో గల ఆంతర్యమేమిటో తెలుసుకోవాలనుకున్నాడు.

'ఎవరు మీరు? ఎందుకొచ్చారు?' అన్నాడు శాంతంగా.

'అదంతా నీ కనవసరం. తాళపుచేతు లివ్వు. మా పనేదో మేం జూసుకొని వెళ్తాం. పిచ్చిపిచ్చి ప్రయత్నాలు చేశావో ప్రాణాలు దక్కవు' కర్కశంగా వుందా కంఠం.

'ఏమిటి మీపని ?'

'బిగ్గరగా నవ్వాడతను. 'మేమెవ్వరమో యింకా నీ కర్థం కాలేదా? ఈ ప్రాంతంవారందరికీ మేమెవ్వరమో, మా పనేమిటో తెలుసు.'

'ఏమిటిదంతా బాస్? నాన్సెన్స్. వాడితో నీకు మాటలేమిటి? నాలుగు తన్ని తాళం చేతులు లాక్కో' అన్నా డింకొకతను మండిపడుతూ—

'మీ పనేమిటో, మీ ఉద్దేశమేమిటో చెబితేగాని తాళంచేతులు యివ్వను' తొణక్కుండా అన్నాడాయన.


'అవ్వవ్వా? నీలాంటి పీనాసిగాండ్లందరూ అవే మాటలే యివి. నాలుగు తంతే లబో దిబోమంటూ నువ్వే చెబుతావ్' పైపైకి రాబోయిన అతన్ని చూసి బెదరలేదాయన. మనస్సులో ఒక విధమైన తెగువ కలిగింది. వారి గురించి పూర్తిగా తెలుసుకోనిదే లొంగిపోకూడదనుకున్నాడు.

'నా దగ్గర తాళపుచేతులు లేవు. అవెక్కడ పెట్టానో మీకు తెలీదు. కానీ అవి మీకిస్తాను, నేనడిగినవాటికి సమాధానం చెప్తేనే యిస్తాను. లేకుంటే మీరు నన్ను చంపినా ఆ చోటు చెప్పను'

సడలని అతని బింకాన్ని చూసి, అదరని అతని గుండె ధైర్యాన్ని చూసి అచ్చెరువొందారు వారు. కొరకరాని కొయ్యగా తయారైన అతన్నెలా లోబరుచుకోవాలో బోధపడలేదు వారికి.

'సరే చెబుతాను విను. విని తాళంచెవులు ఎక్కడున్నాయో చెప్పకుండానే హఠాత్తుగా గుండాగి చచ్చేవు.' అని ఆయన శాంత గంభీర వదనంలోకి చూస్తూ, 'నా పేరు నాగుమల్లు. మా గ్యాంగ్‌కు బాస్‌ను నేను. అర్థమైందా?' అన్నాడు.

చిర్నవ్వుతో తలూపాడాయన. అంతకే



తను కొరగానివాడని చూసి ఆశ్చర్యపోయాడు నాగుమల్లు. తన చరిత్రలో అంత గుండె నిబ్బరంగల మనిషిని చూడని అతను ఆయన సంగతేంటో తెలుసుకోవాలనుకున్నాడు.

'నా పనేదో అడిగావు గదా? చెప్తాను విను. ధనవంతుల్ని దోచుకోవడం, బీదవాండ్లకు పంచి పెట్టడమన్నది నా పవిత్ర లక్ష్యం! అది నెరవేర్చడమే నా పని' అన్నాడు నాగుమల్లు.

'అలాగా? మీరు దోచుకున్నది ఎంత మంది పేదవాండ్లకు పంచి పెట్టారు?'

'అప్!' పళ్ళు పట పట కొరికాడు నాగుమల్లు. 'నా మాటకు మా గ్యాంగులోనే ఎదురు లేదు. నన్ను ఎదురు ప్రశ్న వేస్తావా?' అన్నాడు గర్జిస్తూ.

'నీకు తాళంచేతులు గావాలా, వద్దా?' శాంతంగా అన్నాడు వెంకటామయ్య.

'కావాలి! అందుకోసమే వచ్చాం. నీ సర్వస్వం దోచుకుంటాం!'

'అదెంతమంది బీదవాళ్ళకు పంచి పెడతారు?'

'అది నీ కనవసరం' గద్దించాడతను.

'పొగరుకు పోకు! నే నడిగినదానికి విడమరచి సమాధానం చెప్పు. ధనవంతుల దగ్గర్నుంచి డబ్బెందుకు దోచుకుంటున్నావ్?'

ఆయన శాంత గంభీర ధోరణికి,

# గాఢాంధకారంలో...

లోటకని నిందురవానికి కొంచెం చలించాడు నాగుమల్లు. మిగిలిన యిద్దరూ చోద్యం చూస్తున్నట్టు చూస్తూండిపోయారు.

'మీ ధనవంతుల దగ్గరున్న డబ్బు దుర్వినియోగం అవుతున్నది. పేదవాండ్లు ఆకలికి మల మల మాడుతూంటే మీరు స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తున్నారు. అలా అయేందుకు వీల్లేదు. ఆ డబ్బును సద్వినియోగ పర్చాలి. అది మిమ్మల్ని దోచుకుంటేనే సాధ్యపడుతుంది.'


'కానా? సద్వినియోగ పరిచేందుకే గదా, ధనాన్ని దోచుకుంటున్నావ్! నువ్వు దోచుకున్న డబ్బు ఎలా సద్వినియోగ పర్చావో చెప్పు?'

నాగుమల్లు ఏం చెప్పాలో తోచక, సమాధానంకోసం తికమక పడుతూ మౌనం వహించాడు.

'ఏయ్! ఏమిటా వాగుడు? బాస్! అలా నిలబడతావేం? నాలుగు తన్నాలా?' అన్నాడొకతను గర్జిస్తూ.

'నువ్వాగు డేవిడ్! అవును, ఎవరికీ పంచలేదు. కానీ బీదవాండ్లను పీడించి అన్యాయంగా మీరు ఆర్జిస్తున్న డబ్బును దోచుకుంటాం.'

'నా కథ వింటావా? విని నీకు తోచి




కొత్తగా ప్రవేశించాను. నేను అన్యాయంగా ధనాన్ని సంపాదించానని తోస్తే నీ కిష్టం వచ్చిన రీతిగా దోచుకుపో. నేను సంపాదించిన ఈ ధనం చెమటోడ్చి, నా రక్తాన్ని కండబట్టా నీరుగా మార్చగా లభించింది. ఒకప్పుడు నేనుగూడా బీదవాణ్ణే. తిండికి గతిలేక, భార్యా బిడ్డలు ఆకలితో అలమటిస్తూ అష్టకష్టాలు పడ్డవాణ్ణే కాని మీలాగా నే ధనవంతుల్ని దోచుకోలేదు. కష్టపడ్డాను, సంపాదించాను. దైవ కృప వలన ఈ స్థితికి చేరుకోగలిగాను.'

ఆశ్చర్యంగా వింటున్నాడు నాగుమల్లు.

'ఇంతధనం సంపాదించినా బీదల నెన్నడూ హింసించలేదు. వారి బాధ కున్నాను. ఒకప్పుడు నాలాగే ఆకలికి అలమటించిన వారిని చేరదీశాను. నా వ్యాపారంలోనైనా బీదలకు అన్యాయం జరుగనివ్వలేదు. ధనవంతులనుండి డబ్బు ఎక్కువ గుంజినా, లాభమివ్వలేని స్థితిలో నున్నప్పుడు లేనివారినుండి లాభా లాశించలేదు. ఒక్కొక్కప్పుడు నాకెంత నష్టం వచ్చినా యిచ్చివేసేను. నా గొప్పలు చెప్పుకోవడం గాదుగాని, నా దుకాణంలో వున్న గుమాస్తాలూ, మా తోటమాలీ, మా యింట్లో వున్న పనివారూ అందరూ మొదట ఆకలికి అలమటించిన వారే. వారికో ఆధారం లభించింది. వారు కష్టపడి బాగుపడితే నాకంతకన్నా ఆనందం ఉండదు. మీరు బీదవారుగదా, డబ్బులేక గదా మీరీస్థితికి దిగజారింది? రండి మీకు పనులిప్పిస్తాను, మీకో ఆధారం చూపిస్తాను. నాలాగే కష్టపడండి, డబ్బు సంపాదించండి, సుఖపడండి.

'మల్లూ! పదిమంది బీదవాండ్లను ఆదుకున్నది నేనా? డబ్బును కొల్లగొట్టి అనుభవిస్తున్న నువ్వా?'

నాగుమల్లుకు తల తిరిగిపోతున్నది. 'నిజమే! తాను డబ్బును ధనవంతుల ఖజానాల నుండి కొల్లగొట్టడమే కాని, ఎన్నడూ పేదలకు పంచియివ్వలేదు. తనదగ్గర డబ్బు మూలుగుతున్నది. తనూ ధనవంతుడయ్యాడు. కాని ఏ మార్గం వలన? ధనవంతుల నిర్మూలించాలన్న తన వాదానికే, తన లక్ష్యానికే తాను వ్యతిరేకి అయ్యాడు. తానునుసరిస్తున్నది పతిమార్గమన్న తనది! పవిత్ర లక్ష్యమని

ఉరికిపోయాడు. కాని యిప్పుడు...?

'నేను ఆవేశంగా మాట్లాడినందుకు నామీద కోపం తెచ్చుకోకు మల్లూ! నువ్వీ ధనాన్ని సద్వినియోగ పరుస్తానని త్రికరణ శుద్ధిగా వాగ్దానమిస్తే, నా స్వహస్తాలతోనే నీకీ ధనాన్ని అప్పగిస్తాను. ఆ వాగ్దానం యివ్వగలవా మల్లూ? మాట్లాడవేం?'

ఆయన ముఖంలోకి సూటిగా చూసాడు నాగుమల్లు. ఆ శాంత గంభీర వదనాన్నవలోకించలేక చూపు మరల్చుకొని, 'పదండ్రా, యింకోచోటికి వెళ్దాం' అన్నాడు వెనక్కి తిరుగుతూ.

'ఒరేయ్! బాస్‌వైనా నీకు బుద్ధుందా? యింత కష్టపడివచ్చి వెనక్కుపోవటమా? ముసలాడేదో వేడ్‌గా వాగుతే నువ్వు ఫూల్‌వై మమ్మల్ని ఫూల్స్‌చేస్తావుట్రా? వాడంతేదో నేను తేల్చుకుంటాను చూడు' అరుస్తూ ముందుకు రాబోతున్న డేవిడ్ చేయి పట్టుకు వెనక్కి లాగాడు మల్లు.

'ఖాన్! వీడ్ని పట్టుకో. పదండి వెళ్దాం' అన్నాడు.

డేవిడ్ ఎగిరి పడటం చూసి, 'నే చెప్పినట్టుగా వినకపోయావో షూట్ చేస్తాను' అన్నాడు నాగుమల్లు కోపంగా.

'ఉగ్! నన్ను షూట్ చేస్తావుట్రా రాస్కెల్!' పళ్ళు పటపట కొరుకుతూ తుపాకిని నాగుమల్లు గుండెల్లోకి పేల్చాడు డేవిడ్.

'దేవుడా!' అంటూ పడిపోయాడు నాగుమల్లు.

వెన్వెంటనే 'ఓ గాడ్!' అంటూ నేల కొరిగిపోయాడు డేవిడ్.

'హాండ్సప్! కదిలావంటే కాల్చేస్తా!' అంటూ ఖాన్ వెన్నుపై పిస్టలుంచి అరిచిన చంద్రాన్ని చూసి విస్తుపోయాడు వెంకట్రామయ్య. హఠాత్తుగా జరిగిపోయిన ఆ సంఘటనకు తల తిరిగిపోయింది.

బాధతో మెలికలు తిరుగుతున్న నాగుమల్లు దగ్గరికి వెళ్ళి, 'ఎంతపని జరిగిపోయింది మల్లూ!' అన్నాడు కన్నీటి మధ్య.

బాధతో పొర్లుతూ, గాయాన్ని చేత్తో అదుముకుంటూ, వెంకట్రామయ్య కళ్ళల్లోకి చూస్తూ చిన్నగా నవ్వాడు నాగుమల్లు. ●


నొప్పిని అతిశీఘ్రంగా తొలగించడానికి 'ఆస్ప్రో' మాత్రమే మైక్రోఫైనడ్ చేయబడినది




వీటికోసం క్రొత్త మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను వాడండి: నొప్పి • తల నొప్పి • ఒళ్ళు నొప్పి • ఫ్లూ • జ్వరముతో కూడిన జలుబు • కీళ్ళ నొప్పి • గొంతుక నొప్పి • పంటి పోటు.
మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్ళలు. అవసరమైతే మళ్ళీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ళ. లేక డాక్టర్ సలహా ప్రకారము వేసుకొనవలెను.
క్రొత్త మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' నొప్పిని నివారించుటకు ఇప్పుడు మీకు లభించే వాటిలో అతి ఆధునికమైన సాధనము.



క్రొత్త మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' అతి శీఘ్రంగా నొప్పిని తొలగించును

నికోలస్ (N) తయారీ